మహాత్ములకు చావులేదు

విశాలమైన వటవృక్షం నీడన మొలచిన వేపమొక్కల్లా, సువిశాలమైన భారతదేశం పరిధుల్లో ఎదుగూబొదుగు లేని పల్లెటూరు అది. ఊరికి అన్ని హంగులూ ఉన్నాయి. బడి ఉంది. పంచాయితీబోర్డు ఉంది. ఊరిని నాలుగు వైపులా కలుపుతూ వీధులున్నాయి. వీధులు పరిశుభ్రంగా ఉన్నాయి. నీతి, నిజాయితీలు అక్కడి ప్రజల రక్తంలో ప్రవహిస్తూ ఉంటాయి. ప్రేమ, అభిమానం వారి ధ్యేయం. మానవ శరీరానికి ప్రాణం ఎంత అవసరమో, జీవితానికి ధర్మం అంత అవసరమంటారు ఆ ఊరి ప్రజలు.

పట్టణంలోని రాజకీయాలు, మత కలహాలు, ఆధునిక పద్ధతులు ఆ ఊరివారికి పట్టవు. తనకు తోచిన న్యాయం ఆ ఊరి మునసబు చేస్తాడు. అంతేనంటాడు కరణం. ప్రెసిడెంటు దానికి ఎదురుచెప్పడు. ప్రజలకు అదే వేదవాక్కు. ఇలా ఆ గ్రామ పరిపాలన నాలుగు పాదాలమీద నడవడానికి కారణం పరోక్షంగా రామశాస్త్రి.

కాని రాముడు కాలంలో రావణుడున్నట్లే ఇక్కడా దుర్మార్గులు లేకపోలేదు. కాని మేరు పర్వతాల్లాంటి నీతి, న్యాయం, ధర్మం, పరిపాలన చేస్తోంటే వాటి క్రింద ఉన్న మట్టిబెడ్డల్లా కదలక మెదలక పడివున్నారు.

రామశాస్త్రి తన ప్రాతఃకాలపు దినచర్యంలో ప్రథమభాగంగా వెంకటేశ్వర సుప్రభాతం చదివి వాకిట్లో కొచ్చేసరికి ఎదురగా తోట చివరి వసారాలోంచి సన్నని ఏడుపు వినిపిస్తూ వుంది.

"ఒరేయ్ నాయనా ఊరుకోరా, పంతులుగారు లేవంగానే పాలు తెచ్చి పోత్తాను" అంటూ సముదాయిస్తోంది మంగమ్మ.

"ఏమే మంగీ. కృష్ణ ఏడుస్తున్నాడా" పిల్చాడు రామశాస్త్రి. ఏడుపు ఠక్కున ఆగిపోయింది.

"పంతులుగోరూ, వత్తున్నానండో, అమ్మగోరు లెగిసిర్నా" చీకటిని పీల్చుకుంటూ ఒక పల్చని స్వరం రామశాస్త్రి చెవుల్ని తాకింది. ఆ వెనకనే యాభైసంవత్సరాల పనిమనిషి మంగమ్మ వరండాను చుట్టి దొడ్డివైపు పరుగెత్తింది.

రామశాస్త్రి మౌనంగా తలపంకించాడు. దీనికి పనిచేయడం తప్ప, రెండో విషయం తెలియదు. ఇదే విధంగా దేశమంతటా ఉంటే సోమరిపోతులకు స్థానం ఉండదు. దేశం బీదరికపు హస్తాల్లోంచి స్వేచ్ఛగా బయటపడేది'' అనుకొన్నాడు.

ఆ ఊరి యువకులంతా రామశాస్త్రి మాటలను ఎదిరించి ఒక్క అడుగు ముందుకు వేయరు. ఆయన ఒకరికి సలహా ఇచ్చే ముందు తను ఆచరించి మరీ చెప్తాడు. వ్యవసాయదారులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థులకు ఎవరికి ఏసలహాలు చెప్పాలో ఆయనకు బాగా తెలుసు.

ఆయన ప్రతి సాయంకాలం ఊరిమధ్య రచ్చబండమీద కూర్చొని శాస్త్రాలు చెబుతాడు. వృద్ధులు, పిల్లలు. స్త్రీలు ఒకవైపు రైతులు, మిగతా కూలీలు, మరొకవైపు చాపలు, పరచుకొని కూర్చొంటారు. మునసబు, కరణము, ప్రెసిడెంటు, మిగతా ఒకరిద్దరు పెద్దలు అదే అరుగులమీద ఆ చివర కూర్చొంటారు. ఆయన ఒక్క రామాయణ, భారత, భాగవతాలేగాక కలియుగ పురుషులైన గాంధీమహాత్ముడు, సుభాష్‌చంద్రబోస్, వల్లభాయి పటేల్, నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రివంటి రాజకీయ పితామహుల కథలు. రవీంద్రనాథ్‌ఠాగూర్, సరోజినీదేవి, శరత్ రచనల విశిష్టత. గురజాడ అప్పారావు జాతీయ భావాలు, కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణలను ఆయన వివరిస్తారు. ప్రస్తుతం

దేశంలోని రాజకీయ పరిస్థితులుగూడా వారికి అర్థమయ్యే రీతిలో కథలు కథలుగా చెబుతుంటాడు.

రామశాస్త్రి ఖద్దరుధోవతిని గోచిపోసి కట్టుకొన్నాడు. తెల్లని పరిశుభ్రమైన వస్త్రాన్ని భుజంచుట్టూ చుట్టుకొన్నాడు. ఒకచేతిలో గాంధీజీ జీవితగ్రంథం, మరికొన్ని స్కూలు పుస్తకాలు, రెండవ చేతిలో వంకీ కర్ర పట్టుకొని ఉన్నాడు. తలమీద పగలూ, రాత్రికి ప్రతిరూపాలుగా తెలుపూ, నలుపూ, వెంట్రుకలు కలగాపులగంగా కలిసి ఉన్నాయి. ఎర్రని శరీర ఛాయతో ముఖాన సింధూరంతో, ప్రాతఃకాలపు రేయెండకు అజానుబాహువైన అతని శరీరం విష్ణువు ప్రతిరూపంలా మెరిసిపోతూ ఉంది.

తపస్సుకు మెచ్చి వరమిచ్చిన దేవుడిలా ఏడ్చి ఏడ్చి శక్తి లేక నీరసంగా గుడిసెముందు చాపమీద పడుకొనిఉన్న తొమ్మిది నెలల కృష్ణ ముందు నాలుగడుగుల దూరంలో నిలబడ్డాడు రామ శాస్త్రి. వాడి ముఖంలోని తేజస్సును, కళ్లలోని కాంతిని పరిశీలిస్తున్న రామశాస్త్రి 'నువ్వు అమాయకుడివి. నా ఏడుపు విని ఎంత మోసపోయావు' అన్నట్లు బోసినవ్వులు నవ్వాడు వాడు నోరంతా తెరచి.

కాంతివంతంగా మండిన మనస్సు మరలా అంతలోనే చప్ప బడి పోయింది. ఒక్క నిట్టూర్పు విడిచాడు. 'వీడి జీవితం ఎలా ఉంటుందో! తన ఆశయాలకు ప్రతిరూపంగా దిద్దాలన్న తన కోరిక నెరవేరుస్తాడో, లేదో' అనుకున్నాడు.

అసలు ఎవరీ కృష్ణ? అని ప్రశ్నిస్తే జవాబు చాలా విచిత్రంగా ఉంటుంది. ఒక వర్షం వెలిసిన రాత్రి, తూరుపు కొది సేపట్లో తెలతెల వారుతూందనగా గోపన్న మేకల దొడ్డి ఊడ్చడానికి తడిక విప్పబోయాడు. కాని తన పాదాలదగ్గర తెల్లని వస్త్రంమీద కేరుకేరు మంటూ ఇంకో తెల్లని పసిబిడ్డ, రాత్రి ఉరి

మిన ఊరుముకు మెరుపు అంచుపట్టుకొని అకాశం నుంచి జారిన ప్రతిరూపం లాగుంది. అంతకుముందు రోజే కన్నబిడ్డ అర్ధాంతరంగా పోతే అ అగ్నిజ్వాలల్లో ఇంకా ఆ౨ని కడుపు ఈ పసి కందును చూడగానే ఎందుకో చన్నీళ్లు చల్లినట్లయింది, పనంత టితో ఆపి పసికందును చేతుల్లో తీసుకెళ్లి భార్యకు చూపించాడు. అ బిడ్డను చూసి, అతని భార్య గుండెల్లోంచి మమత పాలు పొంగి వాటికవే స్రవించసాగాయి.

మరునటిరోజు ఉదయం జరిగిన సమావేశంలో ఊరి వాళ్లంతా పాల్గొన్నారు. అబిడ్డ ఎవరూ అన్నవిషయం ఎవరూ చెప్పలేకపోయారు. చివరకు గోపన్న తనే పెంచుకుంటానన్న తరువాత అ సమస్య తేలిగ్గా పరిష్కరింపబడింది, కాని అబిడ్డ ఎవరూ అన్నవిషయం అపరిష్కృతంగా ఉండిపోయింది. మూడవ తరగతి చెప్పే పెళ్లికాని పంతులమ్మ రజనికి, పట్నంలో మెడిసన్ చదువుతున్న సూర్యప్రకాశరావుకి సంబంధం అంటగట్టారు కొందరు. ఇద్దరూ ఆదివారాల రోజుల్లో ఒకరి నొకరు విడిచిపెట్టకుండా మాట్లాడుకోవడం, సాయంకాలంపూట షికార్లకు పోవడం, ఉన్నట్లుండి రజని స్కూలునుంచి మాయంకావడం ఇందుకు సాక్ష్యం అంటారు. బిడ్డను గోపన్న తనస్వంతం చేసుకొన్న రాత్రే రజని, అత్మహత్య చేసుకొన్నట్లు పట్నంనుంచి వార్తరావడం, అది తెలిసి సూర్యప్రకాశరావు గుండె పగిలేలా ఏడ్వడం అందరికీ రకరకాల అనుమానాలు రేకెత్తించాయి

రామశాస్త్రికి ఇద్దరూ తెలుసు. తను హెడ్మాస్టరయితే, రజని మూడవ తరగతి టీచరు. మంచి భావాలున్న వ్యక్తి. అమె నిజాయితీ తనకు తెలుసు. ఇక సూర్యప్రకాశరావు నిప్పులాంటి మనిషి. తన శిష్యుడు. తప్పుచేయడు. ఎందుకైనా మంచిదని ఈ విషయం కదిపాడు.

"మాస్టారూ! నన్ను నమ్మండి. రజనికి నేను అంత ద్రోహం చేస్తానా. నేను ప్రేమించిన మాట నిజమే. కాని ఆమె అర్థాంతరంగా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చివెళ్ళడం, తరువాత ఇలా మరణించడం నాకేం అర్థం కావడంలేదు" అన్నాడు.

అలాంటి పరిస్థితుల్లో గోపన్న ఇంటిదగ్గర పెరుగుతున్న కృష్ణకు వచ్చిన కష్టం అతని జీవిత మార్గాన్నే వేరొక మలుపు త్రిప్పింది. కృష్ణకు తొమ్మిది నెలలు రాగానే ఒకరోజు జ్వరం వచ్చింది. తగ్గిపోతుందిలే అని ఏవో మందులు వాడారు. రెండు రోజుల తరువాత జ్వరం పోతూపోతూ కృష్ణను ఒంటికాలివాణ్ని చేసిపోయింది. కృష్ణకు ఎడమ కాలుకు పోలియో అటాక్ అయింది.

స్కూలు వదిలింతర్వాత ఇంటికి వెళ్తున్న రామశాస్త్రి గోపన్న ఇంట్లోంచి వస్తున్న ఏడుపులు విని ఆగి లోపలికి ప్రవేశించాడు. "సామే నాజీవితం ఇంకేంగాను కృష్ణ కుంటోడయి పోయిండు. ఆడికాలు దేవుడెత్తుకుపోయిండు. నానెలాసాకి ఈడ్ని పోసించేది. మేం ముసిలోళ్ళమయితే మాకు కూడు ఎవరు ఎడ్తరు. ఈడుమాకు ఆధారంఅనుకొంటే, ఆడికి మేము అదారమయ్యాము" రామశాస్త్రి కాళ్ళమీద పడి ఏడ్చాడు గోపన్న. గోపన్న భార్య నేలమీదపడి దొర్లుతూ ఏడుస్తూఉంది. రామశాస్త్రి కృష్ణ కాలుపట్టుకొని చూచాడు. తోటకూరకాడలా చలనం లేకుండా వాలిపోతూ ఉంది.

రామశాస్త్రి తనే కొంత అర్థిక సహాయంచేసి, బండి కట్టించి గోపన్నను, అతని భార్యను అందులో ఎక్కించి పిల్లవాడిని చూపించమని పదిమైళ్ళలో ఉన్న టౌనుకు పంపాడు. కాని ఫలితం శూన్యం. డాక్టర్లు ఇక అది నయంకాదన్నారు. నిరాశతో తిరిగి వచ్చారు గోపన్న దంపతులు. ఒకరోజు స్కూలుకుపోతూ క్రింద మట్టిలో అనాథలా పొర్లాడుతున్న కృష్ణను చూసి అతని మనసు

ద్రవించిపోయింది. తెల్లగా, బొద్దుగా ఎప్పుడూ నవ్వుతూ కని పించే కృష్ణ ఇప్పుడు సన్నగా ఎండిపోయి ఉన్నాడు. కళ్ళలో కాంతి తరిగిపోయింది. ఒక కాలు ఈడ్చుకుంటూ ఇంటిముందు మైదానంలో పొర్లాడుతున్నాడు.

కృష్ణను తనవద్ద ఉంచుకోవడం గోపన్నకు ఇష్టంలేదని తెలుసుకొన్న రామశాస్త్రి తన ఇంటి ఆవరణలో గుడిసె వేసుకొని ఉంటున్న పనిమనిషి మంగమ్మకు వాడ్ని అప్పగించాడు. దానితో పీడవదలిపోయింది గదాని గోపన్న ఎగిరి గంతేశాడు. గ్రామప్రజలు తనెందుకు గౌరవిస్తున్నారో రామశాస్త్రికి తెలుసు తన పద్ధతులు, సంస్కారం ఇవే కారణం. కృష్ణని తనఇంట్లో పెట్టుకొంటే ఊరిలో కట్టుబాటు తెగిపోతుంది, ఊరు చిన్నాభిన్నమైపోతుందనేది అతని భయం. దేవుడు గుడిలో అదృశ్యంగా ఉంటే భయపడుతున్న ప్రజలు, అతను నిజంగా మనుషుల రూపంలో గ్రామంలో నివ సిస్తూ ఉంటే ఆయన్ను ఖూనీచేయడానికైనా సాహసించరీ ప్రజ లని అతనికి తెలుసు. కృష్ణ బాగోగులకు ఆర్థికంగా సహాయం చేయసాగాడు రామశాస్త్రి.

కాలం చకచకా జరిగిపోతూ ఉంది. కృష్ణకు ఇప్పుడు ఎని మిది సంవత్సరాలు. ఉదయం అయిదున్నర గంటలకు నిద్ర లేస్తాడు. కాలకృత్యాలు తీర్చుకొని పూజచేస్తాడు. తరువాత ఏడు గంటల వరకు చదువుతాడు. తరువాత ఒకగంట తోటపని. మంగమ్మ నీళ్ళు తెచ్చి పోస్తూంటే చెట్లన్నిటికీ బోదెలు చేస్తాడు. తరువాత ఏచెట్టుకయినా చీడపట్టిందేమోనని ఒకసారి చెట్లన్నిటిని పరిశీలించి చూస్తాడు. ఒకప్పుడు మైదానంలోఉన్న నలభై అంకణాల రామ శాస్త్రి ఇంటి ముంగిలి ఇప్పుడు రకరకాల పూలచెట్లతో ఒకవైపు, మరోవైపు రకరకాల కూరగాయలచెట్లతో నిండివుంది.

కృష్ణ నాలుగవ తరగతి చదువుతున్నాడు. వాడి తెలివికి విషయ పరిజ్ఞానానికి రామశాస్త్రి ఆశ్చర్యపోతున్నాడు. సంవత్సరం సిలబస్ రెండు నెలల్లోనే పూర్తిచేసి 'ఏం చెయ్యను మాస్టారూ' అని అడిగేవాడు. ఎక్కడ ఏదడిగినా ఠకీమని చెప్పేవాడు. తెలుగు పద్యాలు ఒకటి అడిగితే అన్నీ ఏకరువు పెడ్తాడు. ఇక మాస్టారు ఏం చెప్పగలడు?

"ఒరే కుంటోడా" అని పిల్లలెవరన్నా పిలిస్తే సంకక్రింద కర్రతో వెనక్కు తిరిగి చూసేవాడు "ఏరా శీనూ" అనేవాడు. పిల్లలంతా 'కుంటోడు! కుంటోడు!!' అంటూ ఎగతాళి చేసేవారు. "అవున్రా! నేను నిజంగా కుంటోడ్నేగదా నన్నలాగే పిలవండి" అనేవాడు దాంతో పిల్లలంతా నిరాశపడిపోయేవారు. వాడు ఎదురుతిరిగి తిడితే, అందరూ కలిసి వాణ్ణికొట్టి నవ్వుకోవాలని వాళ్ళ ఉద్దేశం కాని వాళ్ళ కోరిక నెరవేరేది కాదు.

"నీకు అమ్మా! నాన్న లేరురా! దిక్కులేనివాడివి" ఆఖరి అస్త్రం ప్రయోగించేవాళ్ళు.

"ఒరే మీకు ఒక అమ్మ, ఒక నాన్నఅయితే. ఈ ఊళ్ళో అందరూ నా అమ్మా, నాన్నలేరా. శీనూ! మొన్న మీ అమ్మ నాకు పప్పులు పెట్టిందిరా! గుర్నాథం మీనాన్న నేను వస్తూంటే ఏదైనా కొనుక్కోమని రూపాయిచ్చేడురా! శంకరంగాడి అన్నయ్య నన్ను పిల్చి నాలుగు గోళీకాయలిచ్చేడురా!.... ఇంతమంది నాకున్నారు గదా! దిక్కులేనివాళ్ళకు దేవుడే దిక్కని మా మాస్టారు చెప్పారు గదరా" అంటూ నవ్వుతూ చెప్పేవాడు. చాటుగా ఎప్పుడో, ఏ అర్ధ రాత్రో అన్నీ గుర్తుచేసుకొని ఒక కన్నీటిబొట్టు వదిలేవాడు.

ఇవన్నీ రామశాస్త్రి గమనిస్తూనే ఉన్నాడు. కర్రసాయం తోనే కృష్ణ, రామశాస్త్రిగారి ఇంటిముందు పూలచెట్లచుట్టూ, కాయ

గూరల చెట్లచుట్టూ జాగ్రత్తగా తిరిగి కాపుకాసేవాడు. ఒక్కచేత్తోనే బోరింగు నీళ్ళు కొట్టేవాడు. అతనుచేసిన కాలువ వెంబడి నీళ్ళు చెట్ల పాదులకు చేరేవి. కృష్ణ పండించిన కాయగూరలు, పూలు అవసరానికి కొద్దిగా ఉంచుకొని, మిగతావి పట్నంనుంచి వచ్చే వాళ్ళకు అమ్మేవాడు రామశాస్త్రి. ఆ డబ్బు కృష్ణ చదువుకోసం కూడబెట్టసాగాడు.

రామశాస్త్రి దగ్గర ఎన్నో పురాణాలు విన్నాడు. వాటిలో రామాయణం బాగా నచ్చింది కృష్ణకు. శ్రీరాముడంటే వాడి మనసులో పూజ్యభావం అంచెలంచెలుగా పెరిగి కొండంత అయ్యింది. సీతమ్మ మహాతల్లంటే వాడికి వల్లమాలిన అభిమానం. ఆమె పధ్నాలుగేళ్ళు రావణాసురుడి చేతిలో పడ్డ కష్టాలు తలచుకొని కన్నీరుకారుస్తాడు. దేశనాయకుల్లో మహాత్మాగాంధీ చరిత్ర వాడి గుండెల్లో చెరగని ముద్రఅయింది. ఆయన చరిత్ర, ఆయన దేశానికి చేసిన సేవలు మాస్టారుచేత మరలా మరలా చెప్పించుకొని వాటిని గురించే ఆలోచిస్తూ ఎన్నో అందమైన కలలు కనేవాడు. తనూ అటువంటి త్యాగాలుచేసే రోజు వస్తుందా అని అనుకొనేవాడు. ఇక ఆధునిక రచయితల్లో వీరేశలింగంపంతులు స్త్రీ అభ్యుదయం కోసం చేసిన సేవలు ఎదిగీ ఎదగని అతని లేత మనసుకు అర్థంగాకపోయినా, ఆయన ఆ సేవలో ఎదుర్కొన్న ఇబ్బందులు, తదనుగుణంగా బాగుపడిన ఎన్నోజీవితాలు, పరిపక్వంగాని ఈ సంఘాన్ని ఆయన ఎదిర్చి నిలబడడం ఎంతైనా మెచ్చుకుంటాడు. 'దేశమును ప్రేమించుమన్నా' అన్న గురజాడ అప్పారావు గేయం రోజుకొకసారన్నా పాడుకొంటాడు.

కృష్ణ ఐదవ క్లాసు పాసయ్యాడు. ఇప్పుడు రామశాస్త్రికి మరొక సమస్య వచ్చిపడింది. సెలవులకు వచ్చిన సూర్యాన్ని పిలిపించి ఈ విషయమే మాట్లాడాడు.

"మాస్టారూ! కృష్ణని హాస్టలులో చేరుస్తాం. చాలా బాగుంటుంది. నేనూ పట్నంలో ఉంటున్నాను కాబట్టి వాడి బాగోగులు చూసుకొంటాను" అన్నాడు. అంతే! మరో పదిరోజుల్లో హైస్కూల్లో ఫస్ట్‌ఫారంలో చేర్పించాడు. హాస్టల్లో మకాం. రామశాస్త్రి హాయిగా గాలి పీల్చాడు.

కాని, తరువాత పది హేనురోజులకల్లా చేతినంచితో వచ్చిన కృష్ణ, "మాస్టారూ! నేనిక స్కూలుకు పోను" అనే సరికి రామశాస్త్రి ఆశయాలకు ఆనకట్ట పడింది. చివరకు "ఏంనాయనా? ఏమైంది?" అంటూ అడిగాడు.

హాస్టలులో పిల్లలంతా ఏడిపిస్తున్నారు మాస్టారు! ఒకడు నా పుస్తకం చించేశాడు. ఇంకొకడు నడుస్తుంటే కర్ర లాగేశాడు. మరొకడు నా భోజనం ప్లేటు దాచేశాడు. నిద్రపోతూంటే చెవిలో నీళ్ళు పోస్తున్నారు. నేనిక్కడే తోటపని చేసుకుంటూ బ్రతుకుతాను మాస్టారూ" వాడి కళ్ళలోపలి పొరల్లోంచి కన్నీళ్ళు ఉబికాయి.

రామశాస్త్రి హృదయం చిన్నగా మూలిగింది. లేని చిరునవ్వు తెచ్చుకొని, "నాయనా కృష్ణా తెలివిగల వాడివిరా నువ్వు. మనిషికి పట్టుదల కావాలిరా. గాంధీమహాత్ముడు నీలాగే అనుకొని వుంటే మనకీనాడు స్వాతంత్ర్యం వచ్చేదా ఆయన దక్షిణాఫ్రికాలో పడ్డకష్టాలు తలచుకో. అంతకంటే ఎక్కువా నీవి. సర్దార్ వల్లభాయిపటేల్ చొక్కా విప్పి తుపాకికి ఎదురుగా గుండె చూపిన రోజు గుర్తుతెచ్చుకో. వీరేశలింగంపంతులు ఎన్నో అవమానాల్ని అడుగడుగునా పొందుతూ ఎంతమంది వితంతు జీవితాల్ని పుష్పింపజేశాడు.... వాళ్ళ కష్టాలు మనం ఆలోచిస్తున్నామా! వాళ్ళ త్యాగాల్నే కదా మనం గుర్తుచేసుకొనేది....ఇంతకీ నే చెప్పొచ్చేదే

మంటే, మనిషికీ కావలసింది మొదటిది పట్టుదల. రెండవది త్యాగం. అంతే నాయనా! అంతే. బాగా ఆలోచించుకో" అన్నాడు.

రామశాస్త్రి మాటలు కృష్ణ మెదడులో ప్రవేశించి, అణు వణువూ ప్రాకాయి. మాస్టారుగారికి నమస్కారంచేసి దృఢదీక్షతో వెనుకకు మరలాడు తను కోరి వాణ్ని కష్టాల్లోకి పంపిస్తున్నాడేమో నని ఒక్కక్షణం అనుకొన్నా, తరువాత తనకు అటువంటి ఆలో చన వచ్చినందుకు చింతించాడు.

పూజ్యనీయులైన మాస్టారు గారికి,

నమస్కారం మాస్టారూ! ఈ పరీక్షల్లో తప్పక ఫస్ట్ క్లాస్ వస్తుంది. కారణం నాలాంటివాళ్ళు డిస్టింక్షన్ కోరుకోవటం తప్పు కాబట్టి.

మాస్టారూ పదిరోజుల క్రితం ఒక విషయం జరిగింది. నాకెందుకో ఆరోజు నిద్రపట్టలేదు. నానా అవస్థపడుతున్నాను. ఇంతలో స్టోరురూములోంచి ఏదో శబ్దం వినిపించింది. లైటు వేశాను. గోడగడియారం ఒంటిగంట చూపిస్తోంది. నాకెందుకో అనుమానం వచ్చి లైటార్పి మేముండే బిల్డింగుకు కొద్దిదూరంలో ఉన్న స్టోరు రూమువైపు నడిచాను. ఆ చీకటిలో రూములో లైటు వెలుగుతుందనేందుకు గుర్తుగా మూసిఉన్న కిటికీ సందుల్లోంచి ఎర్రని వెలుగు కనిపిస్తోంది. లోపలికి చూశాను. ఆశ్చర్యంవేసింది ఆ రోజు సాయంత్రమే పిల్లలందరికీ నిజాయితీగురించి ఉపన్యాసం చెప్పిన వార్డనే స్టోరురూములో ఉన్న సరుకుల్లో సగం సగం వంట వాడి సహాయంతో బస్తాల కెక్కిస్తున్నాడు.

నేను ఆవేశంతో ముందువైపు వెళ్ళి స్టోరురూము తలుపులు తట్టాను. లోపల లైట్లు ఒక్కసారిగా ఆరిపోయాయి. పది నిముషా లయినా తెరచుకోలేదు. నాకు కోపం వచ్చింది. "మిష్టర్ వార్డన్! నువ్వూ, వంటవాడు మర్యాదగా బయటకు రండి. లేదంటే హాస్టల్లో

పిల్లలందర్నీ లేపి తీసుకువస్తాను" అన్నాను. తక్కున తలుపులు తెరచుకొన్నాయి. వెంటనే నా తలమీద పిడుగుపడ్డట్లయింది. కళ్ళు తెరచేసరికి హాస్పిటల్ బెడ్‌మీద ఉన్నాను.

ఉత్తరం చదువుతున్న రామశాస్త్రి చేతులు వణికాయి

"... నువ్వు హాస్టల్లో దొంగతనం చేస్తూంటే పట్టుకొన్నారు. స్టోరురూము తాళాలు నాదగ్గర కొట్టేసి ఇంతపని చేస్తావా. నేను నిజాయితీ గురించీ చెప్పింది ఇదేనా" నా ప్రక్కనే ఉన్న వార్డను గద్దించాడు. "అయన దొంగతనంచేస్తూంటే నేను చూశాను సార్" వంటవాడు అందుకొన్నాడు. డాక్టరుతోసహా, అందరూ నావైపు ప్రశ్నార్థకంగా చూశారు. అక్కడేఉన్న హెడ్మాస్టరు వాళ్ళమాటలు నమ్మలేదు. సరికదా! ఈవిషయం తహశిల్దారువరకూ తీసికెళ్ళి ఎంక్వయిరీ చేయించాలన్నాడు. నేను నిజం చెప్పడానికి నోరు తెరిచాను. కాని అశక్తితో ఏంచెప్పలేక హెడ్మాస్టరువైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసి కళ్ళు మూసుకొన్నాను,

మళ్ళీ నేను కళ్ళు తెరిచేసరికి నాహాస్టలుమేటు సత్యం అవేశంగా చెప్పుకుపోతున్నాడు.... 'లైటు వెలుతురుకు కళ్ళుతెరిచాను. నేను పలుకరించే లోగానే లైటుఆర్పేసి చీకట్లో ఎక్కడికో బయలుదేరాడు కృష్ణ. వీడేంచేస్తాడా అనే కుతూహలంతో నేను వాడ్ని దూరంగా అనుసరించాను. వాడు స్టోరురూమువైపుపోవడం, కొంతసేపటికి 'అమ్మా' అని గావుకేకపెట్టడం విన్నాను. దాంతో హాస్టలు పిల్లలు చాలామంది నిద్రలేచారు. స్టోరు రూములోంచి బయటకు వచ్చిన ఇద్దరు వ్యక్తులూ గోడ అంచునే నక్కుతూ నక్కుతూ గేటు వరకూ వచ్చారు. తాము మోసుకొచ్చిన రెండు బస్తాలు పిట్టగోడ మీంచి రోడ్డుమీదికి నెట్టేశారు. తరువాతవాళ్ళు గేటు దూకారు. చీకట్లో రెండు బస్తాలు గురవయ్యశెట్టి ఇంట్లో చేరాయి. ఇది జరి

గిన సంగతి. ఆ ఇద్దరిలో మొదటి వ్యక్తి వార్డెను, రెండవ వ్యక్తి వంటవాడు....'ఏమంటావు గురవయ్యశెట్టీ' అన్నాడు.

సత్యం వెనుకనే ఉన్న గురవయ్యశెట్టి ముందుకు వచ్చాడు. వార్డెను ఉరిమి చూశాడు. "నన్నేం సెయ్యమంటారయ్యా! ఈసిన్నబ్బయ్య పోలీసోళ్ళకు పోను సేత్తనంటే నిజం ఒప్పేసుకొన్నా" అన్నాడు గురవయ్యశెట్టి నిర్దాక్షిణ్యంగా.

కాబట్టి మాస్టారూ! నిజం ఎప్పుడూ నిజంగానే రుజువవుతుంది. అందుకు ఈ సంఘటనే నిదర్శనం. ప్రస్తుతానికి గాయం మానిపోయింది. సెలవుల్లో వస్తాను. అమ్మగారి క్షేమ సమాచారాలు అడిగినట్లు చెప్పండి. మా మంగమ్మత్తను అడిగానని చెప్పండి.

మీ ఆశీర్వాదలను కోరుతూ,

సదా మీ అడుగుజాడల్లో నడిచే

మీ

కృష్ణ,

రామశాస్త్రి కళ్ళ నుండి జలజల నీళ్ళు రాలాయి. నిన్న దేశ పరిస్థితుల్ని చూసి భయపడిన కృష్ణ ఈరోజు ఎంత ధైర్యంగా ఉంటున్నాడు. 'మాస్టారూ మహాత్ముడు జీవహింసచేయరాదన్నాడుగా, ఎందుకు మనవాళ్ళు వీధికొక మాంసం మార్కెట్ పెట్టారు. గాంధీ తాత మద్యపాన నిషేదం పెట్టాడు గదా మరి ఎందుకు మనం గాంధీపేరుతోనే బ్రాందిషాపులు తెరుస్తున్నాం. అయన చేనేత వస్త్రాలు ధరించమంటే మనం ఇంపోర్టెడ్ బట్టలు తప్ప మరేం వాడడంలేదు. మాస్టారూ మొన్నొకసారి మీటింగులో మహాత్ముడి శిష్యుడనని చెప్పిన వ్యక్తిని నిన్న మర్డర్ చేసాడనే నేరంపై పోలీసులు తీసుకుపోయారు' అంటూ అమాయకంగా అడిగేవాడు కృష్ణ.

"ఏం చెప్పను నాయనా. ప్రజలంతా స్వార్థపరులు. మహాత్ముల పేరును ఇలా వాళ్ళ స్వార్థానికి వాడుకొంటారు. చెప్పేది ఒకటి. చేసేది ఒకటి. దేనికీ పొత్తుండదు" అలా సర్దిచెప్పేవాడు.

అటువంటి కృష్ణ.... నవ్వుకొన్నాడు. కాని అంతలోనే కృష్ణకు తగిలిన దెబ్బ గుర్తుకొచ్చి పట్నం ప్రయాణమయ్యాడు.

"కృష్ణా....కృష్ణా" అంటూ గావుకేకలు పెట్టాడు రామశాస్త్రి. తోటలో సంక క్రింద కర్ర అధారంతో వంగి వంకాయలు తుంచి బుట్టలో వేస్తున్న కృష్ణ ఆశ్చర్యంగా "ఏం మాస్టారూ" అన్నాడు.

"నువ్వు టెన్త్‌క్లాస్ ఫస్టు వచ్చావు కృష్ణయ్యా" అంటూ చేతిలోని పేపరు అవతలపడేసి కృష్ణను కౌగిలించు కొన్నాడు. ఆ ఊపుకు అతని చేతిక్రింద కర్ర జారిపోయింది.

"నాయనా నీ అధారమైన ఆ కర్ర తీసిస్తాను. నన్నువదులు" అన్నాడు రామశాస్త్రి.

"వద్దు మాస్టారూ ఆ ఆధారం తాత్కాలికం. ఈ అధారం శాశ్వతం. నేనేదయినా అభివృద్ధిలోకి వస్తే అదంతా మీ చలవే" అంటూ కౌగిలిలోంచి క్రిందికి జారి రామశాస్త్రి పాదాలను కళ్లకు అద్దుకొన్నాడు సజల నయనాలతో.

"కృష్ణా నీకోవిషయం ఎన్నో రోజుల నుంచి చెప్పాలనుకొంటున్నాను నాయనా. నీకోసం కులం, మతం లాంటి సంఘపు కట్టుబాట్లను ఎప్పుడోతెంచేశాను. ఈరోజునుంచినువ్వు మాఇంట్లోనే ఉండు" కృష్ణను పైకిలేవదీసి ఆప్యాయంగా అన్నాడు రామశాస్త్రి.

"వద్దు మాస్టారూ వద్దు, మంగమ్మత్త ఇంట్లో ఉంటున్నా పోషించేది మీరేగా. నన్నక్కడే ఉండనివ్వండి మాస్టారూ" అంటూ బతిమాలుకున్నాడు కృష్ణ. తను మాస్టారి ఇంట్లోఉంటే జరగబోయే పరిణామాల్ని ఊహించుకొని.

టెన్త్‌క్లాసులో ఫస్టువచ్చినందుకు రాష్ట్రప్రభుత్వం రెండు వేల రూపాయలు అవార్డిచ్చింది. కృష్ణవద్దంటున్నా వినకుండా దానికొక వేయి జతచేసి పట్నం బ్యాంకులో కృష్ణపేరిటవేసి దాన్ని వాడుకోమన్నాడు రామశాస్త్రి. హాస్టల్లో చదువుకు ఎన్నో అంత రాయాలుంటాయని, ప్రత్యేకంగా ఒక రూము ఏర్పాటుచేసి దగ్గరలో మెస్సు కుదిర్చాడు.

కాలం జరజర ప్రాకే త్రాచుపాములా సాగిపోతూ ఉంది. ఇప్పుడు కృష్ణకు ప్రత్యేకమైన గది ఉండడంతో రాత్రి, పగలు చదువులో మునిగిపోయాడు. ఇంటర్మీడియట్ డిస్టింక్షన్‌లో పాస య్యాడు. డిగ్రీలో యూనివర్సిటీ ఫస్టు రావాలని అతని ఆశయం.

లెకరర్లకు ఇతనంటే మంచి అభిమానం. విద్యార్థులు కృష్ణను ఎంతో గౌరవిస్తారు, డిబేట్స్‌లో ఇతని ఉపన్యాసాలకు ఎగ బడతారు. సెమినార్స్‌లో ఇతని సలహాలకు చెవికోసు కొంటారు.

ఏపుగా పెరిగి, గుబురు మీసాలతో, గిరిజాల జుట్టుతో ఆరో గ్యంగా ఎర్రగా నిగనిగలాడుతున్న అతని శరీరాన్ని ఆద్యంతము కళ్లతోనే స్పర్శిస్తాడు రామశాస్త్రి. కాని తోటకూరకాడలా వ్రేలా డుతూ పాంటులో దూరిఉన్న ఎడమకాలు చంద్రునికో మచ్చలా ఉంది.

ఒకరోజు కాలేజి డిబేట్‌లో స్త్రీ స్వాతంత్ర్యం అనే టాపిక్ మీద ఉపన్యసించి వస్తున్నాడు కృష్ణ. అది చీకటి రాత్రి. కాలేజి గార్డెన్ దగ్గరకొచ్చేసరికి అశోకవృక్షం, దాని ప్రక్కనున్న పొద ల్నుంచి ఏవేవో శబ్దాలు, కీచుగొంతులు వినిపిస్తున్నాయి. కృష్ణ శబ్దంకాకుండా కొమ్మలను తొలగించుకొని కొద్దిదూరంనడచి ఆకుల సందుల్లోంచి చూసాడు. ఆ ప్రదేశంలో నలుగురు వ్యక్తులు నిల బడి ఉన్నారు. నలుగురి చేతుల్లోనూ, నాలుగు టార్చిలైట్లు వెలుగు తున్నాయి. మధ్యలో ఒక స్త్రీ. ఆకాంతిలో ఆమె రెండు చేతులతో

గుండెను కప్పుకొని ఉంది. కారణం ఆమె చీర జాకెట్టు ఒకడి చేతిలో ఉన్నాయి.

"నన్ను వదులు డేవిడ్ బ్రదర్ నేనేం చేసానని నన్నిలా హింసిస్తున్నారు. మీరంతా మన కాలేజీ వాళ్లే. నన్నెరిగినవారు. నన్ను వదలండి ఈవిషయం ఎవరికీ రిపోర్టుచేయనని ప్రమాణం చేస్తున్నాను" సిగ్గుతో ముడుచుకుపోయి ప్రాధేయపడుతోంది.

హ్హా....హ్హా....హ్హా...మేం నిన్నంత ఈజీగా వదలడానికి తీసుకురాలేదు. మేము నలుగురం. నీవు ఒక్కదానివి. ఇప్పుడు ఏకృష్ణుడు వచ్చి నీ మానాన్ని కాపాడుతాడో చూస్తాం" అన్నాడు ఒకడు. అందరూ నవ్వారు, రాక్షసుల్లా ఆమెమీదికి ఉరికారు.

కృష్ణలో ఆవేశం ముంచుకొచ్చింది. ఆమె ఎవరో కాదు. తన క్లాస్‌మేట్ దేవకీరాణి. వాళ్లలో ఇద్దరు తన క్లాస్‌మేట్సు. చెట్లను చీల్చుకొని ప్రవేశించాడు. సంకలోని కర్రతో నలుగురినీ గార్డెనంతా తిప్పి తిప్పి కొట్టాడు. సమయం చూసుకొని రోడ్డు మీదికి పరుగెత్తిన దేవకీరాణి అప్పుడే ఇళ్ళకు వెడుతున్న స్టూడెంట్సుకి ఈ విషయం చెప్పింది. అంతా ఒక్కుమ్మడిగా పరుగెత్తారు. రక్తపు మడుగులో పడివున్న కృష్ణ కనిపించాడు. కాని దుర్మార్గులు అంతులేరు

....

టెలిగ్రాం అందగానే పరుగెత్తుకు వచ్చిన రామశాస్త్రికి గవర్నమెంటు హాస్పిటల్‌లో తెల్లని బట్టలక్రింద నవ్వుతున్న కృష్ణ శవం దర్శన మిచ్చింది. శరీరంలో ప్రాణంలేదు. కాని నవ్వులో జీవం ఉంది

"కృష్ణ గుర్తుగా మాకాలేజీలో 'కృష్ణా మెమోరియల్ డిబేట్ సెంటర్' కట్టిస్తున్నాం." అన్న ప్రిన్సిపాల్ మాటలు రామశాస్త్రి గుండెలో సూటిగా గుచ్చుకొన్నాయి.

"సార్! మీకు దణ్ణం పెడతాను. ఆ పనిమాత్రం చేయకండి. నా కృష్ణ ఆత్మ శాంతించదు. వాడు మహాత్ముడు వాడికి కావలసింది సంఘంలో నిజమైన మార్పు. వీడి మరణంతో ఏ ఒక్క దుర్మార్గుడి మనసు మార్చుకొన్నా నాకు సంతోషమే. అంతేగాని వాడి గుర్తుగా శిలాశాసనాలు అక్కర్లేదు సార్" అన్నాడు.

నదులు ఎక్కడోపుట్టి సముద్రంలో కలుస్తున్నాయి. వాటి పుట్టుక గురించి ఎవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కాని మానవాళికి అవి ఎంతవరకు ఉపయోగపడుతున్నాయనేది తెలుసుకోవలసిన విషయం!

నాలుగురోడ్లకూడలిలో గాంధీమహాత్ముని విగ్రహంముంచు పిచ్చివాడిలా నిలబడి ఉన్నాడు రామశాస్త్రి. గాంధీమహాత్ముడి ఒక చేతిలో భగవద్గీత. మరొక చేతిలో కర్ర. ఒక కాలు ముందుకు వేశాడు, ఇంకొక కాలు వెనుక ఉంది. కళ్లజోడులోంచి చూస్తూ బోసినవ్వులు నవ్వుతున్నాడు.

"బాపూ. చూసావుగా. నీవు అభివృద్ధిపథంలోవేసిన అడుగు అంతటితో ఆగిపోయింది. రెండవ అడుగు పడలేదు. ఇంకొకసారి ఈలోకంలో మరలా జన్మించకు మహాత్మా. మరలా జన్మించకు'' తలను మహాత్ముని పాదాలకేసి కొట్టుకుంటూ బోరున ఏడ్చాడు రామశాస్త్రి.

పూజ్య బాపూజీ మరలా ఎందుకు పుడతాడు రామశాస్త్రి పిచ్చిగాని! మహాత్ములకు చావులేదు కనుక వారు మరలా జన్మించే అవకాశం లేదు. వారు జీవించి ఉన్నప్పుడే వాళ్లని ఆదరించాలి. వారి ద్వారా తమ జీవితాల్ని మార్చుకోవాలి. అంతే!

★